# తెర

కనురెప్పలు విప్పీ విప్పగానే వసంతకాలపు తొలి చిగురులా కళకళ లాడుతూ ప్రభాతంలా, సుప్రభాతంలా ఆమె జయంతికి దర్శనమిచ్చింది.

జయంతికి ఆమె నిండుతనం గొప్ప హాయిని, వింత ఆహ్లాదాన్ని కల్గిస్తుంది. వాటి తాలుకు మైమరపులోకి జయంతి పూర్తిగా వెళ్లి వెళ్లకమునుపే రోడ్డుమీద రూట్ బస్సు రావటం, ఆగటం, ఆమె ఎక్కటం, బస్సు వెళ్లటం జరిగాయి.

బస్సు పూర్తిగా కనుమరుగయ్యాక 'టైమ్ ఎంతైందో?' అనుకుంటూ మంచం పక్కన వున్న బల్లపై పెట్టిన వాచ్‌వేపు చూస్తుండగా ఆమె దృష్టి వాచ్ పక్కనే ఉన్న దేముని విగ్రహంపై నిల్చింది.

ఈ యింట్లోకి రాకముందు లేస్తూనే జయంతి దేముణ్ణి చూసేది. ఈ యింట్లోకి వచ్చినప్పట్నుంచి ఆమెని చూస్తుంది.

'చాలా టైమ్ అయిందే' అనుకుంటూ హడావుడిగా మంచం దిగి వంటింటివేపు నడిచింది.

రాత్రి చాలా పొద్దుపోయే వరకు చదువుకుంటూ కాస్త పొద్దెక్కాక నిద్రలేవటం మొదటినుండి జయంతికి అలవాటు. యూనివర్సిటీ చదువు పూర్తిచేసి దేశానికి అత్యంతవసరమైన ఉమెన్ వర్కింగ్ ఫోర్స్‌లో జాయిన్ అయినాసరే పొద్దెక్కాక నిద్రలేచే అలవాటు జయంతికి పోలేదు.

ఆర్.పి. కంప్యూటర్స్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నదామె. ఉద్యోగరీత్యా మూడేళ్ల క్రితం ఖమ్మం నుంచి హైదరాబాద్ వచ్చింది.

గత మూడేళ్లుగా వుంటున్నా యింటి అద్దెని ఇంటి యజమాని నిర్మొహమాటంగా

పెంచగానే అంత అద్దె ఇచ్చుకోలేక ఈ ఇంట్లోకీమధ్యే మారిందామె.

ఇంటి యజమాని భాస్కరరావు. అతని భార్య కరుణ పుట్టింటికి వెళ్లటం వలన ఇంతవరకు కరుణని జయంతి చూడలేదు.

★ ★ ★

అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి జయంతి డిపార్ట్‌మెంట్‌కి వెళ్లింది. అప్పటికే అకౌంటెంట్ విమల కుర్చీలో కూర్చుని ఎదురు చూస్తోంది.

ఎఱ్ఱగా వాచి వున్న విమల కళ్లని చూస్తూ "ఏంటి రాత్రి మళ్లీ మీ ఆయన కొట్టాడా?" బాధగా అడిగింది జయంతి.

విమల జవాబు చెప్పకుండా "వందుంటే ఇస్తావా? శృతి స్కూల్ ఫీజ్ కట్టాలి" అంది.

పర్స్‌లో నుండి డబ్బులు తీసి విమలకి యిస్తూ "ఇలా ఎన్నాళ్లు పడతావే కష్టాలు" జాలిగా అడిగింది.

విమల బేలగా తల దించుకుంది.

"మీ ఆయన తన జీతమే కాకుండా నీది కూడా తాగుడుకి తగలేస్తుంటే అప్పులు చేసి సంసారాన్ని ఎన్నాళ్లిలా లాక్కొస్తావ్? అతనికి గట్టిగా చెప్పు" అంది జయంతి.

"ఎన్నివిధాలా చెప్పినా వినటం లేదు" నిరాశగా అంది విమల.

"డైవోర్స్ ఇచ్చేయ్".

"పిల్లలున్నారని ఆలోచన" అంటూ తన డిపార్ట్‌మెంట్‌కి వెళ్లింది విమల.

"ఈ విమలెప్పుడు బాగుపడుతుందో. రోజూ బాధలే. డైవోర్స్ యిచ్చి హాయిగా బ్రతకొచ్చుగా?" పక్క సీట్ విశాలతో విసుగ్గా అంది జయంతి.

విశాల కంప్యూటర్ ఆన్ చేస్తూ "అదంత తేలికా?" అనడిగింది.

"చదువుకుంది. సంపాదిస్తూంది. హాయిగా బ్రతకడానికి ఇంకేం కావాలి?" ప్రశ్నించింది జయంతి.

"చుట్టూ వున్న ప్రపంచాన్ని ధైర్యంగా ఎదుర్కోవటం".

"ఆఁ ఇప్పుడు ఎవర్ని ఎవరూ పట్టించుకోటం లేదు" తేలిగ్గా అంటూ విశాల మాటల్ని కొట్టిపారేసింది.

ఇ.డి.పి. మేనేజర్ రావడం చూసి విశాల జవాబు చెప్పకుండా స్క్రీన్‌పై దృష్టిని నిలిపింది.

★ ★ ★

కరుణ వూరినుంచి వచ్చింది. జయంతిని ఆప్యాయంగా పలకరించి "మాది చిన్న పల్లె. చదువుకునే సౌకర్యం లేదు. పెద్దగా చదువుకోలేదు. ఇక్కడికొచ్చాకైనా చదువుకుందాం అంటే మావారికి ఇష్టం లేదు. మీలా ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లలకి మాత్రమే యిల్లు యివ్వాలని కోరిక. అది ఇన్నాళ్లకి తీరింది" అంది కరుణ.

"ఎందుకని?" అడిగింది జయంతి.

"పెళ్లికాని ఒంటరి ఆడపిల్లలకి సిటీలో యిల్లు యివ్వడానికి యిష్టపడరుగా. మీకా విషయం తెల్సుండాలే" అంది కరుణ.

"తెలుసు".

"ముందిల్లు అనుపమ అడిగింది. నేనిద్దామని ఎంతో ప్రయత్నించినా ఆయన బొత్తిగా యిష్టపడలేదు. తనకీ మంచి ఇల్లే దొరికిందిలెండి" అంది కరుణ.

స్కూటర్ స్టార్ట్ చెయ్యబోయి చప్పున ఆగి స్టాండ్ వేసి ముఖం చిట్లిస్తూ తిరిగింట్లోకి వస్తున్న భాస్కరరావుని చూసి 'ఏమైందబ్బా?' అనుకుంటూ "అనుపమెవరు?" అనడిగింది జయంతి.

అతని ధోరణికి 'ప్చ్' అని పెదవి విరుస్తూ కరుణ – "మీకింకా ఇక్కడెవరూ పరిచయం కాలేదనుకుంటా. ఆమే అనుపమ" రోడ్డుకి అవతల నుంచున్న ఆమెను చూపించింది కరుణ.

"తనా?! రోజూ చూస్తుంటాను. తనూ నాలా ఒంటరిగానే వుంటున్నారా?" ఆమె పేరు తెల్సిందనే సంతోషంతో అడిగింది జయంతి.

"కాదు. ఆమె భర్తకి ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా యాక్సిడెంట్ అయింది. పోయారు. అదే ఫ్యాక్టరీలో ఆమెకి వుద్యోగం యిచ్చారు. ఓ బాబు కూడా" చెప్పింది కరుణ.

జయంతి నిర్ఘాంతపోయింది. ఆ... మె... ఆమె .... వితంతువా... నిజమా?...

"ఇల్లివ్వటానికి మీవారెందుకు యిష్టపడలేదు?" అడిగింది జయంతి.

"ఆయనకి ఛాదస్తం ఎక్కువ. ఇప్పుడు మీరే చూసారుగా! ఆమె ఎదురయ్యారని బయటికి వెళ్లటం మాని ఎలా చిటపటలాడుతూ యింట్లోకి వెళ్లిపోయారో" బాధగా చెప్పింది కరుణ.

"మీకటువంటి పట్టింపుల్లేవా?" ఆశ్చర్యంగా అడిగింది జయంతి.

"అబ్బే మన నుదిటిగీత బాగుండాలి కాని ఎదుటివాళ్ల తలరాత మనల్నేం చేస్తుంది. మీకాఫీసుకి వేళవ్వటంలా".

"అవుతుంది అవుతుంది" అంటూ జయంతి హడావుడిగా లోపలికి వెళ్లింది.

★ ☆ ★

జయంతికి పదే పదే అనుపమ గుర్తు రావటంతో పని త్వరత్వరగా కావటం లేదు. పని ముగించుకొని బస్టాప్‌కి వెళ్లేసరికి రోజూ వెళ్లే బస్సు వెళ్లిపోయింది. మరో అరగంటద్గాని బస్సు లేదు. కొంతదూరం ఆటోలో మరికొంత దూరం బస్సులో వెళ్లింది. అయినా ఆఫీసుకి వెళ్లేసరికి ఆలస్యం అయింది.

"బోల్డంత పనుంది. ఇంతాలశ్యమా?" మేనేజర్ ప్రశ్నించాడామెని.

ఆమె నొచ్చుకుంది.

డేటా ఎంటర్ చేస్తున్న ఆమెకి అనుపమ గుర్తొస్తూనే వుంది.

అసలు భర్త పోయిన స్త్రీలా లేనేలేదు. ఎంచక్కా బొట్టు... పువ్వులు... గాజులు... కాటుక...

ఆషాడం వస్తే గోరింటాకు... శ్రావణంలో కాళ్లకి పసుపు పూసుకుంటుందేమో... ఏమో?....

"ఏంటండి ఎంటర్ చేస్తున్న డేటానే ఎంటర్ చేస్తున్నారు?" విసుక్కున్నాడు మేనేజర్.

ఆమె మనసంతా చికాకు ఆవరించింది.

★ ★ ★

ఆదివారం జయంతి ఆఫీసుకి సెలవు. తలస్నానం చేసి వంట మొదలుపెట్ట బోతుంటే "జయంతీ" అంటూ కరుణ పిలుపు.

బయటికి వచ్చేసరికి కరుణ, ఆమె వెనకాల అనుపమ. కరుణ పరిచయం చేసిందిద్దర్నీ.

"మా బాబు పుట్టినరోజండి. సాయంత్రం టీకి రండి" చిరునవ్వుతో అనుపమ ఆహ్వానించింది.

"ఊ" అంది జయంతి ఆమె చిరునవ్వుని చూస్తూ.

అనుపమ కొడుకు పుట్టినరోజని ఫ్యాక్టరీకి సెలవు పెట్టటం, వుత్సాహంగా పార్టీ యివ్వటం జయంతికి ఎబ్బెట్టుగా తోచాయి.

ఈమె మనసులో విషాదమే లేదా? భార్యా భర్తలిద్దరూ అన్యోన్యంగానే వుండేవారని కరుణ చెప్పింది.

పార్టీలో నవ్వుతూ ఛలోక్తులు విసురుతూ చలాకీగా తిరుగుతున్న అనుపమని చూస్తుంటే జయంతికి అనీజీగా అన్పించింది. రాత్రి యింటికి వచ్చాక కూడా రూపమే తెలియని అనుపమ భర్తని తలచుకొని దిగులుపడింది.

★ ★ ★

కన్రెప్పలు విప్పగానే అనుపమ దర్శనమిచ్చింది జయంతికి. అయితే ఎప్పట్లా ఆమె ఎదని సుప్రభాత రాగాలు పలకరించలేదు.

"ఛ. తెల్లవార్తూనే దీని మొహం చూసానే' శనివారం నాటి అనుభవాలు ఎదలో కదుల్తుండగా చికాకుగా అనుకుందామె.

"మొన్నీ తల్లి మొఖం చూశాను. బస్సు మిస్ అయింది. ఆఫీస్‌లో చివాట్లు. ఆటో డబ్బులు దండగ. ఈవేళ ఈ గ్రిల్లుకో కర్టెన్ వెయ్యాలి" విసుక్కుంటూ నిర్ణయించుకుంది.

'నిన్నటివరకూ నవ వసంతంలా, వర్షపు గోదావరిలా ఎదలో కదలాడిన అనుపమ నీకింత అప్రియం ఎందుకయింది జయంతీ? భర్త పోయాడని తెలిసిన తర్వాత ఎందుకలా మారిపోయాయి నీ ఆలోచనలు' అని ఆమె తనని తాను ప్రశ్నించుకోలేదు.

'పాతింట్లో వుండగా బస్ మిస్ కాలేదా? మిగిలిన రోజులు వదిలై సోమవారం అదే పోయిన సోమవారం ఆలస్యంగా నిద్ర లేచావు చూడు ఆరోజు బస్ మిస్ అయిందిగా.

ఆటోలో వెళ్లావు. పనిలో పొరపాట్లు చేశావు. చివాట్లు తిన్నావు. ఆరోజు అనుపమ ముఖం చూడలేదుగా. అయినా యివన్నీ ఎందుకయ్యాయంటావ్' - అని తర్కించలేదామె.

జయంతి ఎప్పటిలా సమయానికి బయలుదేరి ఆఫీసుకి వెళ్లింది. సాయంత్రం ఆఫీసు నుంచి యింటికి వస్తూ కర్టెన్ కొనుక్కొచ్చి గ్రిల్‌కి వేసి నిశ్చింతగా నిద్రపోయింది.

అనుపమ గురించి విశాలతో ఏరోజుకారోజు జయంతి చెపుతూనే వుంది. విశాల ఏమైనా అనుకుంటుందేమోననే సంశయం లేకుండా. పుట్టినరోజంటు అనుపమ చేసిన హడావుడి అంటూ విమర్శించేసింది కూడా. విశాల మాత్రం ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తపర్చలేదు.

అనుపమ గురించి జయంతి మాట్లాడుతుండగా విమల వచ్చింది. మూర్తీభవించిన దుఃఖంలా వుందామె.

"ఏమైంది?" ఆత్రంగా అడిగింది జయంతి.

"బంగారం యిమ్మంటే యివ్వనన్నాను. రాత్రి కొట్టి ఒంటిపై బంగారమంతా పట్టుకు పోయారు. ఏ ముహూర్తాన ఈ పెళ్లి చేసుకున్నానో కాని అంతా ఏడుపే" కన్నీటితో అందామె.

"విమలా! ఏడవటం వలన నీ సమస్య తీరదు. ఆలోచించి ఏదో ఒక నిర్ణయం తీసుకో. ఇలా ఏడుస్తూ పిల్లలకి ఏ భవిష్యత్తు ఇవ్వగలవ్. నీ జీవితాన్ని నువ్వే ఆనందంగా మార్చుకోవాలి" మందలింపుగా అంది జయంతి.

"నాకా తెగింపు వుంటే ఎప్పుడో బాగుపడేదాన్ని నిజంగానే నాకు బుద్ధిలేదు. నువ్వెప్పట్నుంచో ఈ నరకం నుంచి బయటికి రమ్మని చెపుతూనే వున్నావ్. ఇలా ధైర్యం చెప్పి అండగా నిలబడే స్నేహితురాలు ఎంతమందికి వుంటారు చెప్పు. నాకు చాలా విసుగొస్తూంది తనతో ఏదో ఒకటి ఆలోచించాలి" తెగింపుతో మాట్లాడేస్తుంది విమల.

"మీకో సలహా, కాస్త ధైర్యం చెప్పినవాళ్లు దానిని మీరాచరించిన రోజు మీకండగా నిలబడరేమోనండి" అనుమానాన్ని నిర్భయంగా వ్యక్తం చేసింది విశాల.

"ఎవరండి?" ఆశ్చర్యంగా అడిగింది విమల.

"మీకు సలహాలిచ్చేవారు".

"జయంతా?" ఆశ్చర్యంగా అడిగింది విమల.

"ఏంటి నీ వుద్దేశ్యం నేనండగా వుండననా" అడిగింది జయంతి.

"అవును" అంది విశాల.

జయంతికి పిచ్చి కోపం వచ్చింది.

"స్పృహలో వుండే మాట్లాడుతున్నావా?" హేళనగా అడిగింది జయంతి.

"జయంతీ, ఒక్కసారి శాంతంగా నీ గురించి నువ్వు ఆలోచించుకో. అనుపమ విషయమే తీసుకో. ఆమె జీవితంలో విషాదం వుంది. ఆ విషాదం నుండి బయట పడటానికి ఆమె ప్రయత్నించి వుంటుంది. దాని పర్యవసానమే ఈనాటి చిర్నవ్వు అయివుండొచ్చు.

కాని నువ్వా నవ్వుని భరించలేక పోతున్నావ్. సుమంగళి - అసుమంగళం అనే సెంటిమెంట్స్ నీకుంటే ఆమెని చూడటమే అశుభం అంటుంటే నీ నమ్మకాలు నీవని సరిపెట్టుకునేదాన్ని. నీ నమ్మకాలెంత భయంకరమైనవో నీలాంటి వాళ్లెప్పుడు మారుతారో అని దిగులు పడేదాన్ని. కాని జయంతీ నువ్వామె జీవన సరళిని ప్రశ్నిస్తున్నావ్?" ఆవేశంగా అంది విశాల.

విమల తెల్లబోయి జయంతి, విశాల వేపు మార్చి మార్చి చూస్తోంది.

"అనుపమ భర్త మంచివాడు. విమల భర్త వలన ఎన్నెన్ని కష్టాలు పడుతోందో నీకు తెలియదా? అదీ ఇదీ ఒక్కటేనా?" రోషంగా ప్రశ్నించింది జయంతి.

"దుఃఖం అన్నది జీవితంలో ఎవరికి ఏ రూపంలో వున్నా దానిని వీలైనంత దూరంగా పంపించి వెయ్యటానికి, దానినుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడడానికి మార్గాలని అన్వేషించాలి. అంతేకాని అనుపమ భర్త మంచివాడు కాబట్టి ఆమెప్పుడూ ఏడుస్తూనే వుండాలని, విమల భర్త చెడ్డవాడు కాబట్టి ఆమె ఎప్పుడూ ఏడవకూడదని అంటే ఎలా? భర్త పెట్టే కష్టాల్లోంచి బయటికి రమ్మని విమలకి ధైర్యం చెప్పే మనసు ఓ కష్టం నుంచి బయటపడటానికి ప్రయత్నించిన స్త్రీని చూసి ఎందుకు మెచ్చుకోలేక పోతోంది. అనుపమని చూస్తే ఎందుకా బిటర్ ఫీలింగ్. పెద్దగా చదువుకోని, ఏ ఆదర్శాలు అంతగా లేని కరుణ ఆలోచనలు - ఆచరణలో ఎంతో వున్నతంగా వున్నాయి. నువ్వేమాత్రం ఆచరిస్తున్నావో ఆలోచించుకో" కఠినంగా అంది విశాల.

జయంతి జవాబు చెప్పలేక కంప్యూటర్‌వేపు చూస్తూండిపోయింది. కాస్త సిగ్గుగాను అన్పించింది.

విశాల చెప్పినట్టు విమల రేపా భర్తని వదిలి కొత్త జీవితం ప్రారంభిస్తే ఆమెకూడా అప్రియంగా తోస్తుందా తనకి అనుకుంది జయంతి.

ప్రకృతి వైపరీత్యాలకి ముక్కలైపోయిన సౌధాన్ని చూసి జాలిపడే హృదయం, శిధిల శకలాలని ఏరుకొని పేర్చుకొని నూతనంగా తిరిగి ఆ సౌధం వెలిస్తే ఎదలో హర్ష ప్రకంపనాలు చెలరేగవా?

తను స్త్రీయే కదా? తనకి స్త్రీలంటే యిష్టమేగా? వాళ్ల ఆనందాన్ని - అభివృద్ధిని తను కోరుకుంటుంది కదా! అయినా అనుపమ విషయంలో తనెంత మూఢంగా ఆలోచించింది. తన పనులకి - ఆలోచనలకి సిగ్గుపడుతూ జయంతి ఆ గ్రిల్‌కి వేసిన కర్టెన్ తీసేసింది.

రోజూ అదే రూపం - నవ వసంతంలా - వర్షపు గోదారిలా అనుపమ రూపం జయంతికి దర్శనమిస్తుంది.

• *పల్లకి వారపత్రిక, 31, మార్చి 1993* •